క్లుప్తంగా

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని నెహ్రూ నగర్ చంద్రవంక బ్రిడ్జి పక్కన ఉన్న ఆదిలక్ష్మి ఆలయంలో శుక్రవారం అర్చకులు వెంకటేశ్వర శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఆదిలక్ష్మి అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సొసైటీ కాలనీలో శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



మాచర్ల: పట్టణంలోని ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు సందర్శించారు. భోజనం పంపిణీని పరిశీలించారు. ఆయన ఆర్యవైశ్య సంఘం, టీడీపీ నాయకులు ఉన్నారు.

రహదారి సర్వే



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపులా హద్దులను గుర్తిస్తున్నట్లు ఆర్ఐ దాసరి కాంతారావు శుక్రవారం తెలిపారు. తహసీల్దార్ కె.కరుణ కుమార్ ఆదేశాల మేరకు వైఆర్ఎస్ హైస్కూల్ నుంచి పెట్రోలు బంక్ వరకు హద్దులు గుర్తించామన్నారు. ప్రధాన రహదారికిరువైపులా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతామన్నారు. వీఆర్వోలు లింగయ్య, రేఖ, విగ్నేష్, సర్వేయర్ అర్జున్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మాజీ కౌన్సిలర్ గురవయ్య మృతి



మాచర్ల: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పల్లెబోయిన గురవయ్య (82) గుండె పోటుతో గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. అనేక రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుమార్తె జి.మస్తానమ్మ 2019లో కౌన్సిలర్‌గా గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, ఆర్ఎంపి అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, సిద్దయ్య చారి, డాక్టర్ శివ, రాంబాబు, వెంకట్రావుతో పాటు పలువురు బీసీ సంఘ నాయకులు, కౌన్సిలర్లు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కూలిన ఇల్లు



మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన గాంతి అన్నపూర్ణ మట్టి మిద్దె శుక్రవారం తెల్లవారు ఝామున కురిసిన వర్షానికి నాని ఆకస్మికంగా కూలిపోయింది. ఇది గమనించిన అన్నపూర్ణమ్మ, భర్త పెద్దిరెడ్డి, కుమారుడు కృష్ణారెడ్డి బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని వస్తువులు, బియ్యం, దుస్తులపై మట్టి పడటంతో వారు కట్టుబట్టలతో నిలిచారు. అధికారులు ఆదుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు వివరాలు తెలుసుకొని, ఉన్నతాధికారులకు నివేదించారు.

క్షేత్రస్థాయిలో సేవలందించాలి



మాచవరం: గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సాగు యాజమాన్య పద్ధతులు తెలియజేస్తూ, ప్రభుత్వ పథకాలను రైతులకు వివరిస్తూ వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఏడీఏ బి.శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాతావరణ ఆధారిత పంటలు, బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా, పంట కోత ప్రయోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దాచేపల్లిలో వినాయ విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ఉత్సవ కమిటీల సభ్యులు



కారెంపూడిలో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు

వినాయక చవితి సందడి

వినాయక.. అనంతకోటి బ్రహ్మాండ నాయకా

వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం జరిగే పండుగ వేడుకలకు పందిళ్లు ముస్తాబయ్యాయి. వాడవాడలా లంబోదరుడి విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఉత్సవ కమిటీల సభ్యులు విగ్రహాలను కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే మండపాలను విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. పూజా సామగ్రి కొనుగోళ్లతో పట్టణం , పల్లె అనే తేడా లేకుండా సందడి వాతావరణం నెలకొంది.

- మండపాలకు గణనాథుడి భారీ విగ్రహాలు
- ఉత్సవ ఏర్పాట్లు, పూజా సామగ్రి కొనుగోళ్లు..

రెంటచింతల: మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు తయారు చేయించిన 1000 మట్టి వినాయకుని ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాచర్ల: వినాయక చవితి సందర్భంగా మాచర్లలో మొత్తంగా 84 మండపాల కోసం ఆన్‌లైన్‌లో పోలీసుల పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అర్బన్ సీఐ ప్రభాకర్‌రావు శుక్రవారం తెలిపారు.

పిడుగురాళ్ల రూరల్: సనాతన ఆచార సాంప్రదాయాలను విద్యార్థుల్లో పెంపొందించేలా ముందస్తుగా గణపతి మహోత్సవాన్ని గీతికా సీబీఎస్‌ఈ విద్యా సంస్థలో శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ టి. బాల గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి గ్రామంలోని విద్యా సంస్థలో విద్యార్థులు మట్టి బొమ్మలను, పేపర్ల మీద ఆకృతులను తీర్చిదిద్దారు. విద్యా సంస్థల డైరెక్టర్ టి.వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఉన్నారు.



మట్టి గణపయ్య ఆసీన దర్పం..



కారెంపూడి బస్టాండ్ సెంటర్‌లో గణపతి మట్టి ప్రతిమల విక్రయం



మాచర్ల అంబేడ్కర్ సెంటర్‌లో లంబోదరుడి ప్రతిమల విక్రయం




మట్టి బొమ్మలను పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, చెన్నారెడ్డి



పిడుగురాళ్లలో లంబోదరుడి మట్టి ప్రతిమలు..



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో వినాయక మట్టి ప్రతిమల పంపిణీ



మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి బజారులో విగ్రహం ఏర్పాటు



కారెంపూడి నుంచి మండపానికి ట్రాక్టర్‌లో విగ్రహం తరలింపు



వినాయకుని వేషధారణలో విద్యార్థి



నవధాన్యాల గణపతి

గోతులు.. పడితే అంతే సంగతులు

రెంటచింతల: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. పశర్లపాడు, పాలువాయి, గోలి, మల్లవరం, తుమ్మకోట, జెట్టిపాలెం, మంచికల్లు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ప్రయాణించేందుకు గ్రామస్తులు జంకుతున్నారు. పశర్లపాడు రహదారిలో ఇప్పటికే వాహనదారులు గోతుల్లో పడి తీవ్రంగా గాయపడ్డారు.



అధ్వానంగా పాలువాయి రోడ్డు

జతిన్ దాస్ సంస్మరణ సభ కరపత్రాల ఆవిష్కరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లో శుక్రవారం కామ్రేడ్ జతిన్ దాస్ 95వ సంస్మరణ సభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఈ నెల 13న సత్తెనపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడి జైలులో తమను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని 43 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన వ్యక్తి కామ్రేడ్ జతిన్ దాస్ అన్నారు. ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్రహాం లింకన్, పీడీఎం జిల్లా అధ్యక్షుడు మస్తాన్‌వలి, కార్యదర్శి జి. రామకృష్ణ, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి ఓర్సు కృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత

ఈపూరు: అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ముప్పాళ్ల గ్రామంలో రేషన్‌షాపుకి చెందిన వాహనంలో కొన్ని పీడీఎస్ బియ్యం బస్తాలు డి.సురేష్‌కు చెందిన ఇంటికి చేరవేసినట్లు గ్రామస్తులు కొందరు దానిని చూసి వీఆర్‌వో ఎస్‌కే అబ్దుల్ నబికి సమాచారం అందించారు. దీంతో వీఆర్‌ఏ జాన్‌సైదాతో కలిసి ఆయన సంఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా 36 పీడీఎస్ బియ్యం బ్యాగులు ఇంట్లోకి చేరవేసినట్లు గుర్తించారు. ఈ బియ్యం ముప్పాళ్ల గ్రామంలోని రేషన్‌షాపు డీలర్ కె.శ్రీనివాసరావుకు చెందినవనిగా విచారణలో తెలింది. పీడీఎస్ బియ్యంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్‌వారికి రిఫోర్ట్ చేయగా ముద్దాయిలు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వీఆర్‌వో తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

క్రోసూరు: మండలంలోని బాలెమర్రు గ్రామంలో శుక్రవారం ఎస్‌ఐ నాగేంద్రరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సయ్యద్ ఆదాం సాహెబ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 35 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆదాం సాహెబ్ పై ఇప్పటికే రెండు కేసులున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన అక్రమ మద్యం, గుట్కాలు, గంజాయి విక్రయిస్తున్నట్లు పేకాట నిర్వహిస్తున్న సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సహకరించండి..సంతోషంగా వేడుకలు చేసుకోండి

మాచర్ల: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో తప్పనిసరిగా వినాయక చవితి వేడుకల నిర్వహణకు పోలీసుల అనుమతి తీసుకోవాలని అర్బన్, రూరల్ సీఐలు ప్రభాకర్‌రావు, షేక్ నఫీజ్ బాషా తెలిపారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పలువురు యాప్ ద్వారా ఉత్సవాలకు అనుమతులు తీసుకున్నారని చెప్పారు. ఇంకా ఎవరైనా అనుమతి తీసుకోకుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, కుల, మత, ప్రాంతీయ భావనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఇద్దరు మండపం వద్ద రాత్రి కాపలా ఉండి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి, ఉత్సవాలను జయప్రదంగా జరుపుకొని గణనాథుడి ఆశీస్సులు పొందాలని కోరారు. ఎస్‌ఐ నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐలు ప్రభాకర్‌రావు, నఫీజ్ బాషా

ఉత్సవ కమిటీలకు సీసీ కెమెరాల పంపిణీ

పిడుగురాళ్ల: వినాయక చవితి పందిళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విగ్రహ కమిటీ సభ్యులకు పట్టణ సీఐ శ్రీరాం వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో వారితో మాట్లాడారు. ఎటువంటి గొడవలకు దిగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు పట్టణ పోలీసులు తీసుకోవడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి మండపం వద్ద నిమజ్జనం చేసేంత వరకు సీసీ కెమెరాలు పనిచేస్తూ ఉండాలన్నారు. అలాగే నిమజ్జనం సమయంలో వీడియోలు తీయాలని స్పష్టం చేశారు. అనంతరం వినాయక చవితి పట్టణ కమిటీ సభ్యులకు సీసీ కెమెరాలను సీఐ వెంకటరావు, ఎస్‌ఐ ఎం.మోహన్ అందజేశారు. ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యుడికి వైఫై సీసీ కెమెరా అందిస్తున్న పోలీసులు

వానలు మాయం.. గుంతల మయం



చర్చి బజారుకు వెళ్లే రోడ్డు



కూరగాయల మార్కెట్ రోడ్డులో పడిన గుంత



కిడ్స్ పాఠశాలకు వెళ్లే రోడ్డులో గుంతలు



దెబ్బతిన్న సొసైటీ కాలనీకి వెళ్లే రోడ్డు

భారీ వర్షాలకు పట్టణంలోని పలు రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతల మయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. నడవడానికి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పురపాలక సంఘం అధికారులు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – మాచర్ల

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నకరికల్లు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవచవరం మిద్దె సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు..ద్విచక్ర వాహనాలు వేగంగా ఢీకొట్టగా నకరికల్లుకు చెందిన కండ్లకుంట వెంకటేష్(23) తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న నకరికల్లుకు చెందిన షేక్ బాజీ, అతని వెనుక ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్టు

చిలకలూరిపేట: స్కూటీల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అర్బన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అర్బన్ సీఐ పి రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురానికి చెందిన కత్తి శివ, క్రీస్తు కాలనీకి చెందిన తన్నీరు ఉమా శంకర్, పెద నందిపాడు రోడ్డులో నివాసం ఉండే ఒంటిపులి నరేంద్రబాబు గత కొంతకాలంగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు మూడు వాహనాలపై అనుమానాస్పదంగా చిక్కారు. వీరిని విచారించి ఎనిమిది స్కూటీలు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు.

పీహెచ్‌సీకి కుర్చీల వితరణ



రెంటచింతల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుర్చీలను అందజేయడం అభినందనీయమని డాక్టర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సాగరు మాత క్యాటరింగ్ నిర్వాహకులు ఇగుటూరి సత్యనారాయణరెడ్డి ఆయన కుమారులు ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేంద్రారెడ్డి 70 కుర్చీలను పీహెచ్‌సీకి అందజేశారు. డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీలో సభలు, సమావేశాల సమయంలో కుర్చీల అవసరం ఉందని తెలుసుకుని సత్య నారాయణరెడ్డి వాటిని అందజేశారన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధికి, సహకారం అందిస్తున్న సత్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మలేరియా సబ్‌యూనిట్ పర్యవేక్షణ అధికారి సీహెచ్ అంకమ్మరావు, పీహెచ్‌సీ సూపర్ వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ ఎ.ఆంజనేయులు, పీహెచ్‌సీ సిబ్బంది, మహేష్, డి.సీతారామిరెడ్డి పాల్గొన్నారు.